‘ఉపాధి’ వేతనాలు పెంపు

- రూ. 28పెంచిన కేంద్ర ప్రభుత్వం
- తిరుమలగిరి మండలంలో 9వేలమంది కూలీలకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే తీపి కబురు ఇచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రోజు వారి వేతనాన్ని పెంచుతూ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పెరిగిన కూలీ రేట్లు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీల్లో 32,895 జాబ్‌కార్డులు ఉన్నాయి. 13,327 మంది కూలీలు ఉన్నారు. ఉపాధిహామీ కూలి రేట్లు ప్రభుత్వం పెంచడంతో మండలంలో పనిచేస్తున్న సుమారు ఎనిమిది నుంచి తొమ్మిది వేల మందికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో రోజు వారి ఉపాధిహామీ పనికి హాజరయ్యే కూలీల సంఖ్య రెండు వారాల కంటే ప్రస్తుతం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రూ. 272 నుంచి రూ. 300లకు..

ఉపాధిహామీ పనిలో భాగంగా ప్రస్తుతం ఫీడర్ చానల్, హరితహారంలో మొక్కల సంరక్షణ, చేపల చెరువులు, చెరువుల్లో పూడికతీత, వర్షపు నీరు వడిసి పట్టేల గుంతల తవ్వకం వంటి పనులు చేపడుతున్నారు. ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీ నిర్ణీత సమయంలో పనిచేసేవారికి రోజుకు రూ. 272 ఉండగా తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం రోజుకు రూ.28 పెంచడంతో రూ. 272 నుంచి రూ. 300 చెల్లించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం ఉన్న కూలి కంటే కేంద్ర ప్రభుత్వం రూ. 28 పెంచింది. ఉపాధిహామీ కూలీలకు ఇది ఊరటనిచ్చే అంశం. కూలీలు నిర్ణిత సమయంలో పనికి వచ్చినట్లయితే పూర్తి కూలి వచ్చే అవకాశం ఉంటుంది. ఉపాధిహామీ కూలీలు అందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– బొలిగొర్ల శ్రీరాములు, ఏపీఓ, తిరుమలగిరి

పనిదినాలు పెంచాలి



కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు రూ.28 పెంచడంతో దాని మొత్తం రూ. 300 ఇస్తున్నందుకు సంతోషం. కానీ కూలీల పని దినాలు కూడా పెంచాలి. ఇప్పటి వరకు అవే పని దినాలు ఉండటంతో మా లాంటి కొన్ని కుటుంబాలకు ఇబ్బందులు తప్పడం లేదు. వంద రోజుల నుంచి రెండువందల రోజుల వరకు పెంచాలి.
– రమావత్ లాలు నాయక్, సుంకిశాలతండా

జాతరలు.. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు


వేములపల్లి : గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


పెద్దవూర : గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి

వేములపల్లి : జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొలకపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో ఆయన డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్‌తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పెద్ద గొల్ల బారి సైదులు, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, బారి పాండు, పేరెల్లి నగేష్, కొమ్మనబోయిన ఆంజనేయులు, పాదూరి కిరణ్‌రెడ్డి, జెర్రిపోతుల సురేందర్, రాచూరి వెంకన్న, కరుణాకర్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర

పెద్దవూర: యాదవుల ఆరాధ్య, కుల దైవమైన గంగమ్మతల్లి జాతరను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవులు బలిగంపతో ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పువాయిద్యాలతో గంగ గుడి వద్దకు చేరుకున్నారు. ఆయుధ పూజ చేసి అమ్మవారికి జంతుబలి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాదగిరిగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి ఉన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి


మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు


నిడమనూరు : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మిర్యాలగూడ : ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. ఎన్నిక కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పీఓ, ఏపీఓలు కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఆధారాలు లేకుండా పలు వాహనాల్లో తీసుకెళ్తున్న రూ.31,39,367ను పలువురి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 5250 మంది పీడబ్ల్యూడీ, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారిని గుర్తించి వారు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 8689295001 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని లేదా సీ–విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు అందిని 90నివిషాల్లోనే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.

నిడమనూరు: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన సాగర్ నియోజకవర్గంలో పీఓ(ప్రిసైడింగ్ ఆఫీసర్), ఏపీఓ(అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్)లకు మండల కేంద్రంలో సోమ, మంగళవారాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఎన్నికల విధులకు సంబంధించి సూచనలు, సలహాలు వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి ఈసారి పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం ప్రత్యేకంగా స్పెషల్ క్యాజువల్ లీవు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కృష్ణయ్య, జయశ్రీ, యాదగిరి, కిరణ్, ఎంఈఓ రాము, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

అడవిదేవులపల్లి : వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి. కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు బోర్లు, చేతి పంపులు మరమ్మతులను చేయించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు మిషన్ భగీరథ అధికారులకు కూడా తెలియజేయనున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలోత ఎంపీఓ మెసిన్ బిన్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏఈ ఉ మామహేశ్వర్‌రావు తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రావు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

హాలియా : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని కొత్తపల్లి సహకార సంఘం ఈసీఓ రావుల సత్యం అన్నారు. కొత్తపల్లి సహకారం సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనుముల మండల పరిధిలోని ఇబ్రహీంపేట, యాచారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి క్వింటాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ. 2203, బి గ్రేడ్‌కు రూ. 2183 పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కళ్యాణ్, సంఘం సిబ్బంది మట్టయ్య, శ్రీను, అయూబ్, శంకర్, జానకిరాములు, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

నిడమనూరు : మండలంలోని ఊట్కూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. 2023–24 యాసంగిలో మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం, తుమ్మడం, రేగులగడ్డ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో డీపీఎం అరుణ్‌కుమార్, ఏపీఎం లక్ష్మీనారాయణ, సీసీ యాదయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

వేములపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తాము పండించిన నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.నాగమణి, ఏపీఎం నిజామొద్దిన్, సీసీ రమణయ్య, కమిటీ సభ్యులు సైదమ్మ, లూర్ధమ్మ, జానమ్మ, శ్రీలత, దివ్య, రైతులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, ఏఓ వెంకన్నలు కోరారు. సోమవారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పెండ్లిపాకల, చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యంలో తేమ 17శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి, ఆర్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, పాపిరెడ్డి, నరేశ్, హరి, లక్ష్మణ్, మధునాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


నిడమనూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతపల్లి : మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం విక్రయించాలన్నారు. తేమ శాతం 17 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రావణకుమారి, ఊరె యాదయ్య, ఏఈఓలు నర్సింహ, మౌనిక, ఆర్ఐ యాదయ్య, సీఈఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి :: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం అనూక్ అన్నారు. మండలంలోని ఆగా మోత్కూరు, పాములపాడు, చిరుమర్తి, గార్లకుంటపాలెంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తేవాలని కోరారు. కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగయ్య, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.


హాలియా : ఇబ్రహీంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ రావుల సత్యం


మాడుగులపల్లి : ఆగా మోత్కూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం


చింతపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

బుద్ధవనం సందర్శన టికెట్ రేట్ల పెంపు

నాగార్జునసాగర్ : బుద్ధవనం సందర్శన టికెట్ రేట్లను తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పెంచింది. గతంలో పెద్దలకు రూ.50లు ఉండగా నేటి నుంచి రూ.100లకు పెంచారు. పిల్లలకు (12సంవత్సరాలలోపు)రూ.30లు ఉండగా రూ.50లు, విదేశీ పర్యాటకులకు రూ.300లు, స్టిల్‌కెమెరా తీసుకొని వెళ్తే అదనంగా రూ.25లు, వీడియోకెమెరాకు రోజుకు రూ.10వేలు, కాన్ఫరెన్స్ హాల్‌కు కిరాయి రూ.10,000లకు పెంచారు. పాఠశాల,కళాశాలల విద్యార్థులకు 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

డిండి : గ్రామ పంచాయతీలో గతేడాది జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విత్‌డ్రా చేసిన ఘటనలో అప్పటి సర్పంచ్, గ్రామ కార్యదర్శి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపిస్తూ ఉప సర్పంచ్ నూకం వెంకటేశ్ జనవరి 4న డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం డీపీఓ ఆదేశాల మేరకు దేవరకొండ డీఎల్‌పీఓ ఎంవి. రామమోహన్‌రావు స్థానిక పంచాయతీ విచారణ చేపట్టారు. ఆయన వెంట ఎంపీఓ ఏ.రమేష్, గ్రామకార్యదర్శి జంగయ్య తదితరులున్నారు.

ఎస్సీ వెల్ఫేర్ ఉద్యోగుల కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ డివిజన్ ఎస్సీ వెల్ఫేర్ ఉద్యోగుల కమిటీ కన్వీనర్‌గా దైద శ్రీనివాస్‌ను నియమించారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అవిలయ్య ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం నియామక పత్రాన్ని నల్లగొండ అంబేడ్కర్ భవనంలో అందజేశారు. అదే విధంగా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా పోలేపాక సురేందర్, యువజన సంఘం డివిజన్ కన్వీనర్‌గా ఉబ్బపల్లి శంకర్‌లను కూడా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల పేదలకు అంబేద్కర్ యువజన సంఘం అండగా ఉండి పోరాడుతుందన్నారు. తమ నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు జగన్, మల్లేశం, సత్యం, వెంకట్‌లకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు సోమవారం ఏపీఓ సూర నాయక్ పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. గత నెల వరకు ప్రతి కూలికి రూ.272 చెల్లిస్తుండగా ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త కూలి రూ.300 అమలులోకి వస్తున్నాయన్నారు. జాబ్‌కార్డులున్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు వెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలు సమయపాలనతో పాటు ప్రతి ఒక్కరూ తమ పని ముట్లను తీసుకోని రావాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ మెట్ల మధు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

డబ్బులు ఇప్పించాలని ధర్నా

నాగార్జునసాగర్ : పోస్టాఫీసు ఖాతాల్లో దాచుకున్న డబ్బులను తమకు ఇప్పించాలని కోరుతూ సోమవారం డిపాజిటర్లు స్థానిక పోస్టాఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. నందికొండలోని పైలాన్‌కాలనీ సబ్‌పోస్టాఫీసులో సబ్‌పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ చేతివాటం ప్రదర్శించి ఖాతాదారుల సొమ్మును రూ.2కోట్ల వరకు స్వాహా చేశారు. ఈ ఘటన జరిగి నాలుగు నెలలవుతున్న ఇప్పటి వరకు తమకు డబ్బులు ఇప్పించలేదని ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. ఖాతాదారులు తమ సొమ్మును వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై దేవకొండ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ ఖాతా దారుల రికార్డుల నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. త్వరలో నగదు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.


పోస్టాఫీసు ఎదుట ధర్నా చేస్తున్న డిపాజిటర్లు

నాటకాలు యువతలో చైతన్యం నింపాలి

మిర్యాలగూడ: నాటకాలు యువతలో చైతన్యం నింపేలా ఉండాలని మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటకాలను సోమవారం మూడో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా విజయవాడకు చెందిన జేఎంజే నాట్యమండలి వారి ‘రక్తపాశం’ అనే సాంఘిక నాటిక, గుంటూరుకు చెందిన శ్రీకరణం సురేష్ మెమోరియల్ వారి ‘నాలోన నీవే’ అనే సాంఘిక నాటిక, ఒంగోలుకు చెందిన వారి ‘జీవనయానం’ అనే సాంఘిక నాటిక, జడ్చర్ల మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నవజ్యోతి కళానిలయం వారి ‘మైరావణ’ పద్య నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. అనంతరం కళాకారుల కమిటీ వారు కళాకారులకు ప్రశంసాపత్రాలు, పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు భుజంగరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిశర్మ, కోశాధికారి లక్ష్మీనారాయణశర్మ, గ్యార సాయిలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి రామావతారం, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, దుర్గి శ్రీనివాస్‌శర్మ, రామలింగాచారి, యడ్ల వెంకటేశ్వర్లు, రాఘవయ్య, శ్రీనివాస్‌రావు, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.


‘నాలోన నీవే’ సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

హాలియా : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి బాలునాయక్ అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్యా ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో లక్ష్యా స్కూల్‌లో వెనుకబడిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ తదితర అంశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్స్ ఎన్ సతీష్, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ

క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

మిర్యాలగూడ టౌన్ : కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రీయ విద్యాలయంలోని యూకేజీలో మూడు సీట్లు, ఒకటో తరగతిలోకి ప్రవేశం కల్పించినందున ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, కుల ధ్రువీకరణ,. విద్యార్థి ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

హాలియా : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అనుముల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అనుముల మండల ఎంపీడీఓ కొర్లపాటి సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులు తప్ప కోరం సరిపడా లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతి పురుషోత్తం అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల కు సంబంధించిన మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో విధిగా హాజరుకావాలని కోరారు.

పెద్దఅడిశర్లపల్లిలో..

పెద్దఅడిశర్లపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికై ఏర్పాటు చేయనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు తమ తమ ప్రగతి నివేధికలు తీసుకొని సకాలంలో హాజరు కావాలని కోరారు.

బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గణేశ్



దేవరకొండ : బీజేవైఎం (భారతీయ జనతా యువ మోర్చా) జిల్లా కార్యవర్గ సభ్యుడిగా దేవరకొండ పట్టణానికి చెందిన పాలగోని గణేష్ నియామకమయ్యారు. సోమవారం ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ గణేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ బీజేవైఎం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

యువమోర్చా జిల్లా కార్యదర్శిగా భరత్‌కుమార్




కొండమల్లేపల్లి : భారతీయ జనతా యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా భూతరాజు భరత్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు వంగూరి రాఖీ, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు బొడిగె సాంబశివగౌడ్‌లకు కృతజతలు తెలిపారు.

బెట్టింగ్ నిర్వాహకులను గుర్తించాలి

మిర్యాలగూడ టౌన్ : ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విషపు సంస్కృతి అని, దీంతో అనేక మంది జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. అనేక మంది యువకులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. బెట్టింగ్‌పై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టిని సారించాలని కోరారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా


చినరామయ్య

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి కూరా కుల చిన రామయ్య రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మాజీ హోంమంత్రి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డితో తనకు 40ఏళ్ల రాజకీయ అనుబంధం ఉందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరానని, రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.